వసూళ్ల సంస్కృతికి చెక్!

- రెండో పంటకు పుష్కలంగా సాగునీరు
- రింగ్ బండ్ ఏర్పాటు చేసిన అధికారులు
- ఆయకట్టు రైతుల్లో హర్షం

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని మాటలతో కాకుండా చేతలతో నిరూపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక వరసగా నాలుగోసారి కణేకల్లు చెరువు ఆయకట్టుకు రబీ సాగుకు నీరందించింది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని చెరువు ఆయకట్టు కింద రెండో పంట సాగుకు కృషి చేశారు. అంతేకాక పంట సాగుకు సరిపడ నీరు చెరువులో నిల్వ చేయించి నీటికి ఎలాంటి ఢోకా లేకుండా చేశారు. సాగునీటి కోసం టీడీపీ హయాంలో సాగుతున్న పైసా వసూల్ సంస్కృతికి విప్ చెక్ పెట్టారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లువిరిస్తోంది. కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి చెరువు కింద సుమారు 2,500 ఎకరాల ఆయకట్టుంది. హెచ్చెల్సీ కాలువలో చెరువు విలీనం కాకముందు వర్షాలతో చెరువు నిండేది. ఆ నీళ్లతో రైతులు ఏటా రెండు పంటలు సాగు చేసేవారు. హెచ్చెల్సీలోకి విలీనం తర్వాత చెరువు కింద ఆయకట్టులో రెండో పంట సాగు అందని ద్రాక్షలా మారింది. రైతులు తమకు రెండు పంటలకు సాగునీరివ్వాలని కోరుతున్నా... పాలకులు పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఒకసారి నీరిస్తే మూడు, నాలుగేళ్లు నీళ్లు ఇచ్చేవారు కాదు. ఇప్పుడా సమస్య లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక ప్రతి విషయంలో రైతుకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ఊహించని రీతిలో డ్యాంకు ఇన్‌ఫ్లో


కణేకల్లు చెరువులో పుష్కలంగా ఉన్న నీరు


నీటి నిల్వ కోసం ఇసుకబస్తాలతో రింగ్ బండ్ వేస్తున్న దృశ్యం

వచ్చింది. దామాషా ప్రకారం హెచ్చెల్సీకి ఈ ఏడాది 32.82 టీఎంసీలు కేటాయించగా ఈ నీళ్లను ఈనెల 24 వరకూ డ్రా చేసుకోవడం జరిగింది. ఈక్రమంలో మూడు రోజుల క్రితం హెచ్చెల్సీకి నీటి సరఫరా బంద్ చేశారు. చెరువు కిందనున్న ఆయకట్టుకు మరో నెలన్నర వరకు సాగునీటి అవసరమున్న క్రమంలో విప్ స్పందించి పంటకు సరిపడ నీరు చెరువులో నిల్వ చేయించారు. హెచ్చెల్సీ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడి చెరువులో 11 అడుగుల మేరకు నీటిని నిల్వ చేయాలని ఆదేశించారు. అలాగే నీటి నిల్వ కోసం హెచ్చెల్సీ అక్విడెక్ట్ వద్ద ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేయించాలని విప్ సూచించడంతో.. కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి సోమవారం ఇసుక బస్తాలతో హెచ్చెల్సీ అక్విడెక్ట్ వద్ద ఇసుకబస్తాలతో రింగ్ బండ్ వేయించారు. రింగ్ బండ్ వేయడంతో చెరువులో 11 అడుగుల నీరు నిల్వ ఉంచడం సాధ్యమైంది. దీంతో పంట సాగుకు ఏలాంటి ఢోకా లేదని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట

గతంలో టీడీపీ ప్రభుత్వం అప్పుడప్పుడు రెండో పంటకు సాగునీరిస్తే.. నీళ్లు నిలబెట్టేందుకు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేయాలని ఆయకట్టు రైతులతో కొందరు పెద్దలు డబ్బులు వసూలు చేసేవారు. ఎకరాకు రూ.300 ప్రకారం రేటు ఫిక్స్ చేసి ఆ డబ్బిస్తేనే మీకు నీళ్లు ఇస్తామని ఖరాఖండిగా చెప్పి ముక్కు పిండి రైతుల నుంచి డబ్బు తీసుకునేవాళ్లు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఆ సమస్య కూడా లేదు. విప్ స్వయంగా ఈ ఖర్చులను భరిస్తున్నారు.

గతంలో రైతులతో వసూలు



రింగ్ బండ్ కోసం గతంలో టీడీపీ నాయకులు ఎకరానికి రూ.300 ప్రకారం వసూలు చేసే వారు. అప్పట్లో ఐతే రింగ్ బండ్ ఖర్చు రూ.లక్షన్నర మాత్రమే అయ్యేది. మిగిలిన సొమ్మంతా వసూళ్లు చేసిన పెద్దలు పంచుకునేవారు.

– టి.కేశవరెడ్డి, రైతు

సంతోషంగా ఉంది



రెండో పంటకు నీరివ్వడం చాలా ఆనందంగా ఉంది. రైతులు ఉత్సాహంగా వరి పంటను సాగు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నాలుగోసారి రెండో పంటకు పైసా వసూలు చేయకుండా సాగు నీరును ఇచ్చింది.

– దేవేంద్ర, రైతు

క్లుప్తంగా

'వైఎస్సార్ కంటి వెలుగు' శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని గంజికుంట గ్రామంలో సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి తేజశ్వి కంటి ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు ఇజాజ్‌హుస్సేన్, సీహెచ్‌ఓ గంగాధర్, ఏఎన్‌ఎం జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ సుధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టాల కోసం ధర్నా

కూడేరు: మరుట్ల గ్రామంలో సాగులో ఉన్న రైతులందరికీ పట్టాలివ్వాలంటూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఐ నాయకులు రమణ, మల్లికార్జున, గోపాల్, మనోహర్, శ్రీరాములు మాట్లాడుతూ కొన్నేళ్లుగా పేదలు చీనీ చెట్లు, ఇతర పంటలు సాగు చేసుకుంటూ వస్తున్నారన్నారు. సాగు పట్టాల కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి భూపంపిణీలో పట్టాలివ్వాలని వారు కోరారు.

పశువులకు మెరుగైన వైద్యసేవలు

కూడేరు: పశువులకు మెరుగైన వైద్య సేవలందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య వాహనాన్ని ఏర్పాటు చేసిందని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం సంచార పశు ఆరోగ్య వాహన ఉపయోగంపై స్థానిక పశువైద్యశాలలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే మీ ముంగిటకే వాహనం వచ్చి పశువులకు వైద్య సేవలందిస్తామన్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంటే మెరుగైన వైద్య సేవల కోసం పశువులను జిల్లా కేంద్రంలోని పశు వైద్యశాలకు తీసుకెళ్లి వైద్య సేవలందిస్తామన్నారు. రైతులు, పశువుల పెంపకందారులు సంచార వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతి దూలం లాగుడు పోటీలు

కుందుర్పి: వడ్డెపాళ్యం గుడిబండ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా స్థాయి రాతిదూలం లాడుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొదటి బహుమతి గార్లదిన్నె రామాంజనేయులు ఎద్దులు రూ.50వేలు, రెండో బహుమతి తోపుదుర్తి చిన్నప్ప ఎద్దులు రూ.40వేలు, మూడో బహుమతి రాయదుర్గం కృష్ణమూర్తి ఎద్దులు రూ.30 వేలు, నాలుగో బహుమతి ఆత్మకూరు అక్కమ్మ ఎద్దులు రూ.20 వేలు, ఐదో బహుమతిగా కరిసూర దొడ్డి(గుమ్మఘట్ట) చిన్నపాలయ్య ఎద్దులు రూ.10 వేలు గెలుపొందాయి. విజేతలకు కర్ణాటక చెళ్లకెర ఎమ్మెల్యే రఘుమూర్తి, అర్చకుడు హనుమంతరాయుడు, సర్పంచ్ గోవిందమ్మ, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

హైమాస్ దీపాల ఏర్పాటు


కవితా హోటల్ సర్కిల్ వద్ద హైమాస్ లైట్ వేస్తున్న దృశ్యం

ఉరవకొండ: పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో రూ.10 లక్షల వ్యయంతో సోమవారం స్తంభాలకు హైమాస్ దీపాలను ఏర్పాటు చేశారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్, గుంతకల్లు రోడ్డు, కణేకల్లు క్రాస్ వద్ద 36 అడుగుల ఎత్తు గల హైడ్రాలిక్ స్తంభాలను సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వాహనదారులు, పాదచారులకు హైమాస్ దీపాల వల్ల ఎంతో సౌలభ్యం కల్గుతుందన్నారు.

నివాళి

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పూసల శ్రీనివాసులు మృతదేహానికి సోమవారం ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, సర్పంచులు అనిల్, ఉమేష్, నాయకులు రాజేంద్రరెడ్డి, బీఎన్‌హళ్లి తిప్పేస్వామి, జయరాంరెడ్డి, బేలోడు రామాంజనేయులు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లికి నిధులు మంజూరు చేయాలి

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి వద్ద హంద్రీ నీవా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ మూలంగా ఊటనీటితో ఇబ్బంది పడుతున్న తమకు ఆర్‌అండ్‌ఆర్ నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డితో కలసి జీడిపల్లి వాసులు సోమవారం వినతిపత్రం అందించారు. రానున్న బడ్జెట్‌లో పునరావాసానికి కేటాయించిన సుమారు రూ.78.5 కోట్ల నిధులను మంజూరు చేయాలన్నారు. పునరావాస ప్రక్రియను వేగవంతం చేసి జీడిపల్లివాసుల సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో


మంత్రులకు మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో కలసి వినతిపత్రం అందజేస్తున్న జీడిపల్లివాసులు

జీడిపల్లి వాసులు గాలి బ్రహ్మయ్య, రామన్న, షణ్ముఖ, అక్కులన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి భంభంస్వామి ఉరుసు

రాయదుర్గంటౌన్: సర్వమతాలకు స్వాగతాలయం సద్గురు భంభంస్వామి ఆశ్రమంలో మహాయోగి భంషేక్ అబ్దుల్ వాహాబ్‌స్వామి 54వ ఉరుసు మార్చి 5 నుంచి ప్రారంభించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు బషీర్ అహ్మద్, అబ్దుల్ వాహాబ్ సోమవారం తెలిపారు. మార్చి 5న స్వామి సందల్ ముబరాక్ (గంధము) ఉత్సవం, 6న స్వామి చిత్రపటం ఊరేగింపు, అదేరోజు సాయంత్రం దర్గాలో చిరాఘేన్(దీపారాధన), 7న షంషీర్(బ్రహ్మోత్సవం), జియారత్, పౌర్ణమి, గురుపూజ పీఠాధిపతులచే ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందన్నారు. భక్తులు హాజరై కార్యక్రమాలను జయప్రదం


ఆశ్రమంలో పూజలందుకుంటున్న స్వామి జీవ సమాధి

చేయాలన్నారు. మూడు రోజుల పాటు భంభంబాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

భోగేశ్వరుడికి రుద్రాభిషేకం

వజ్రకరూరు: స్థానిక భోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు, రుద్రాభిషేకం, మహామంగళహారతి,



తీర్థప్ర సాద వినియోగం చేపట్టారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని జరుట్లరాంపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మార్పీఎస్ నేతల పాదయాత్ర

రాయదుర్గంటౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాయదుర్గం నుంచి విజయవాడకు పాదయాత్ర ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ హరి గోపాల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కదరప్ప, గురుమూర్తి, రామాంజనయులు, వన్నూరుస్వామి, భీమరాజు, ముద్దప్ప, రమేష్, రూపేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

• గవిమఠం బ్రహ్మోత్సవాల్లో గజలక్ష్మి సందడి


ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న గవిమఠం ఆస్థాన గజలక్ష్మి

ఉరవకొండ: గవిమఠం బ్రహ్మోత్సవాల్లో మఠం ఆస్థాన ఏనుగు గజలక్ష్మి ఉరవకొండ పురవీధుల్లో సందడి చేస్తోంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా గజలక్ష్మిను చూడటానికి ఆసక్తి చూపుతున్నారు. ఏనుగుకు అరటిపండ్లు, చెరుకు గడలు, పుచ్చకాయ తదితర ఆహార పదార్థాలు అందజేస్తున్నారు. మఠం ఆస్థాన వస్త్రాలు, ఆభరణాలు ధరించి అందంగా ముస్తాబై ఆకట్టుకుంటోంది.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

గుమ్మఘట్ట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్ సూచించారు. మండలకేంద్రంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులను ద్దేశించి ప్రసంగించారు. పరమాత్ముని ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో ఆరాధించాలన్నారు. ప్రేమ, దయ, జాలి, కరుణ, సహనం, శాంతి, ఓపిక కలిగి ఉండాలన్నారు. సన్మార్గంలో నడుచుకుంటూ దైవసన్నిధిలో గడపాలన్నారు. అనంతరం శివలింగం చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.

ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించాలి

వజ్రకరూరు: త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు తల్లిదండ్రు లు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు మనోహర్ కోరారు. సోమవారం మండలంలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండటంతో తల్లిదండ్రులు విద్యార్థుల చదువుపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

శ్రీనివాస విద్యానికేతన్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

బెళుగుప్ప: మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్‌ఎం సుమతో కలసి తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి ప్రారంభించారు. పాఠశాలలో 135 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించడంతో పాటు స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోలార్ ప్రాజెక్టు, యమధర్మరాజు రహదారి ప్రయాణ జాగ్రత్తలు, భువన విజయం, స్పేస్‌సెంటర్, క్షిపణులు, గ్రహాలు, మ్యాజిక్ బాక్స్, తదితర ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.


డ్రైవింగ్ రూల్స్ వివరిస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి

విద్యతోనే సామాజిక, ఆర్థికాభివృద్ధి

కుందుర్పి: సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎదగాలంటే ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదవాలని హైదరాబాదు అభయా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకు బాలచంద్ర సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి అధ్యక్షతన విద్యార్థుల జీవనశైలి, వ్యక్తిత్వ వికాసం,సమాజసేవ తదితర అంశాలపై విద్యార్థులు, స్థానిక మహిళా సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు టి.రాజు,


మాట్లాడుతున్న బాలచంద్ర

దిలీప్‌కుమార్, హెచ్‌ఎం నాగరాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు బీసీ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పెద్దిరెడ్డి నుంచి సన్మానం అందుకుంటున్న చుంచుల నాగప్ప (చేనేత విభాగం), చిన్నంపల్లి సోమశేఖర్ (సాంస్కృతిక విభాగం, పెరుగు తిమ్మరాజు (వైఎస్సార్ సేవాదళ్)

'అనుబంధ' అధ్యక్షులకు సన్మానం

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుల పరిచయ కార్యక్రమం సోమవారం అనంతపురం గుత్తిరోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులను సన్మానించారు.

– అనంతపురం సప్తగిరి సర్కిల్:

4 నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవం మార్చి 4 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సోమవారం తెలిపారు. ఏటా ఫాల్గుణమాసంలో ఈ ఉత్సవాలు ముందుగా మండలంలోని ఉద్దేహాళ్ వద్ద వేదావతి నది వద్ద , అనంతరం ఉప్పరహాళ్ ఆలయం వద్ద జరుగుతాయి. ఈ ఉత్సవాలు రెండు గ్రామాల భక్తులు ఆనందోత్సాహంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకోగా.. ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వాహకులు, కమిటీ సభ్యులు తెలిపారు.

ఏటా నూతన తాటాకు బుట్టలు..

ఉప్పరహాళ్‌లో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆకృతి లేకుండా తాటాకు బుట్టల్లో ఉండి భక్తులకు దర్శనమిస్తారు. వందలాది ఏళ్ల నుంచి ఆచారంగా వజ్రకరూరు మండలం పందికుంటకు చెందిన భక్తులు ఏటా నూతన తాటాకు బుట్టలను అల్లుకుని తెస్తారు. స్వామిని ఉప్పరహాళ్ నుంచి ఉద్దేహాళ్ వద్ద గల వేదావతి హగరి నదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెలిమిలో గురువులు పాత బుట్టల నుంచి కొత్త బుట్టలలోనికి రహస్యంగా మార్చుతారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఊరేగింపుగా సరిహద్దు దారి మీదుగా ఉప్పరహాళ్ దేవాలయానికి చేరుస్తారు. ఈ నేపథ్యంలో హగరి వద్ద , ఉప్పరహాళ్ దేవాలయం వద్ద స్వామి ఊరేగింపు సందర్భంగా అనేక మంది యువకులు , స్త్రీలు, రోగాల నయం కోసం , సంతానం కోసం కోర్కెలు తీర్చుకునేందుకు బోర్లా పడుకుంటారు. వీరిపై స్వామివారు నడుచుకుంటూ ఆలయం చేరుకుంటారు.


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం


ప్రత్యేక అలంకరణలో స్వామి

వ్యవసాయ పరికరాల దగ్ధం

కంబదూరు: అగ్ని ప్రమాదంలో పలువురు రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలు దగ్ధమయ్యాయి. మండలంలోని మర్రిమాకులపల్లి శివారు ప్రాంతంలో ఉన్న ఓ కొండకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పటించారు. మంటలు సమీప పొలాల్లోకి వ్యాపించడంతో రైతులు నేసే తిప్పేస్వామి, బోయ వన్నూర్‌స్వామి, బోయ రమేష్, జయ ప్రకాష్‌కు సంబంధించిన డ్రిప్, స్ప్రింక్లర్లు, ల్యాటర్, ఎర్ర చందనం, మిరప పంటలు కాలిపోయాయి. లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

దాడి కేసులో నలుగురిపై కేసు నమోదు

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలోని అక్కమాంబ గుడి వద్ద ఆదివారం రాత్రి ఓ వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడికి దిగారు. ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు...ప్రభుత్వాస్పత్రి క్వార్టర్స్‌లో ఉంటూ గాలిమరల కంపెనీలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దాసరి మహేష్‌పై ముదిగల్లు గ్రామానికి చెందిన ఈశ్వర్, మరో ముగ్గురు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ ఆయా మృతి


జయమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గం: పట్టణంలోని కమ్మాన్‌పెట్ల వీధికి చెందిన అంగన్‌వాడీ ఆయా జయమ్మ (46) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. కొన్ని రోజులుగా కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఈమె అనంతపురంలోని సవీరా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త వెంకటేశులు, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్త మమత తదితరులు సంతాపం తెలిపారు.

చెట్టును ఢీకొన్న ఆటో

- ఇద్దరికి గాయాలు

కూడేరు: మండల శివారు ప్రాంతమైన లెప్రసీ కాలనీ దగ్గర సోమవారం అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టును ఆటో టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి ఢీకొంది. అనంతపురానికి చెందిన రామాంజనేయులు, రామక్క గాయపడ్డారు. వారు ఆటోలో సిల్వర్ సామాన్లను మండలంలోని పలు గ్రామాల్లో విక్రయించి తిరిగి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. గాయపడ్డ వారు మరో వాహనంలో వెళ్లి వైద్యసేవలు పొందారు.

ఎస్.మల్లాపురంలో చోరీ

కుందుర్పి: మండలంలోని ఎస్.మల్లాపురం గ్రామంలో ఆదివారం రాత్రి మల్లప్ప అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు భాదితుడు సోమవారం కుందుర్పి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంధువుల పెళ్లి నిమిత్తం మల్లప్ప ఇదే మండలం అప్పిలేపల్లికి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. ఇదే అదునుగా దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న రూ.60 వేల నగదు, బిందు సేద్యం పరికరాలు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా వారం రోజులుగా తెనగల్లు, ఓబిగానిపల్లి, తిమ్మాపురం తదితర గ్రామాల్లో రాత్రిళ్లు డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లు ఎత్తుకెళ్తున్నారని ఆయా గ్రామాల రైతులు వాపోయారు.

వ్యాను ఢీ కొని ఇద్దరికి గాయాలు


గాయపడిన చిన్నారి నవనీత్ ,రాము

కళ్యాణదుర్గం: మండలంలోని పాపంపల్లి వద్ద సోమవారం సాయంత్రం వ్యాను ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల వివరాల మేరకు...కళ్యాణదుర్గం నుంచి కుందుర్పికి వెళ్తున్న ఓ కోళ్ల వ్యాను అదుపు తప్పి పాపంపల్లిలో ఇంటి వద్ద అరుగుమీద కూర్చున్న నవనీత్, పెదనాన్న రాములపైకి దూసుకెళ్లింది. ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.